సాక్షి
అనంతపురం

బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



చీనీ టన్ను రూ.18 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.46
కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.46 పలికింది. కనిష్టం రూ.24, సరాసరి రూ.36 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
34.9°/23.4°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

అనంతపురం రూరల్: పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ అన్నారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురం, ఆకుతోటపల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. డీఏఓ ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ రైతులు సాగు సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏ పంటకు ఏ మందులు వాడాలో అవగాహన పెంచుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రవి, ఏఓ శశికళ, ఏఈఓ మురళీకృష్ణ పాల్గొన్నారు.

రేపు బీటెక్ స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 26న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర తెలిపారు. ఏపీ ఈఏపీసెట్ -2024లో బీటెక్ కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్లు భర్తీ అయ్యి మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు ద్వారా భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు గురువారం ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు WWW.SKUCET.AC.IN వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చన్నారు.

సచివాలయ శిలాఫలకం ధ్వంసం



రాప్తాడు: గొందిరెడ్డిపల్లి సచివాలయ శిలాఫలకాన్ని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వివేకానందరెడ్డి, కొండారెడ్డి, చిన్న బాబయ్య మాట్లాడుతూ వైఎస్ జగన్ హయాంలో జరిగిన అభివృద్ధిని ఓర్వలేకే ఈ ఘాతుకానికి పాల్పడ్డారని ఆరోపించారు. సచివాలయ భవనంతో పాటు వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలు నిర్మించి, ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు.

25 నుంచి స్కూల్‌గేమ్స్ ఎంపిక ప్రక్రియ

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా స్కూల్‌గేమ్స్ ఎంపిక ప్రక్రియ ఈ నెల 25 నుంచి నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రెటరీ సుగుణ ఓ ప్రకటనలో తెలిపారు. 25వ తేదీ ఫుట్‌బాల్ అండర్-17 (బాయ్స్, గర్ల్స్)కేటగిరిలో అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో, 26వ తేదీ టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్ అండర్-14 (బాయ్స్, గర్ల్స్) అండర్ -17 (బాయ్స్, గర్ల్స్) కేటగిరి వారికి నారాయణ టెన్నిస్ అకాడమీ అనంతపురంలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తామని వెల్లడించారు. అదే విధంగా 25వ తేదీ రెజ్లింగ్ అండర్-14(బాయ్స్, గర్ల్స్), అండర్ -17 (బాయ్స్, గర్ల్స్) కేటగిరి వారికి కల్లూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో, 28వ తేదీన ఫెన్సింగ్ సెలెక్షన్స్ విద్యారణ్య ఇంగ్లిష్ మీడియం పాఠశాల, అనంతపురంలో, 28వ తేదీ మోడ్రన్ పెంటతలాన్ ఎంపిక ప్రక్రియ వెరిడియన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, బళ్లారి రోడ్‌లో గల స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

జిల్లాలో కరువు ఎలా ఉండేదో.. ఒకప్పుడు ఫ్యాక్షన్ కూడా అంతే తీవ్రంగా ఉండేది. కత్తులు వేటాడి వందలాది కుత్తుకలను బలిగొన్నాయి ఇక్కడ. మరీ ముఖ్యంగా 'రాప్తాడు రక్తచరిత్ర' ఇప్పటికీ చాలామందికి గుర్తుంది. తాజాగా రాప్తాడు నియోజకవర్గం అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత శివారెడ్డి హత్యకేసులో ముద్దాయిలకు జిల్లా చరిత్రలోనే ఎప్పుడూ ఎవరికీ పడని విధంగా 'రెండు జీవిత కాలాల' శిక్ష పడటంతో రాప్తాడు పేరు మళ్లీ తెరమీదకొచ్చింది. రాప్తాడులో జరిగిన హత్యారాజకీయాలపై ఏకంగా సినిమాలు తీశారంటే ఈ నియోజకవర్గ ప్రభావం ఎలా ఉండేదో అంచనా వేయొచ్చు.

పరిటాల స్వార్థం.. కక్షలకు ఆజ్యం



- టీడీపీ హయామంతా రాప్తాడులో నరమేధం
- ఒక సామాజిక వర్గం లక్ష్యంగా దాడులు.. వందలాది మంది బలి
- పలు కేసుల్లో బాధిత కుటుంబాలకు తీవ్రస్థాయిలో బెదిరింపులు
- సాక్ష్యాలు లేకుండా చేయడంతో కనీస విచారణకు నోచుకోని కేసులెన్నో..
- వైఎస్సార్‌సీపీ నేత కందుకూరు శివారెడ్డి హత్య కేసు ముద్దాయిలకు శిక్ష ఖరారు
- 'రెండు జీవిత కాలాల' శిక్ష తీర్పుతో రాష్ట్రంలో మరోమారు చర్చకు వచ్చిన రాప్తాడు రక్తచరిత్ర
- ఈ కేసులోని ముద్దాయిలకు పూర్తిస్థాయిలో అండగా నిలిచిన పరిటాల కుటుంబం!



వైఎస్సార్‌సీపీ నేత శివారెడ్డి హత్య కేసులో శిక్ష పడిన ముద్దాయిలను జైలుకు తరలిస్తున్న పోలీసులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాప్తాడు నియోజకవర్గం పేరెత్తితే ఫ్యాక్షన్ గుర్తుకొస్తుంది. నిత్యం తుపాకీల మోతలు, బాంబు పేలుళ్లు, కత్తుల దాడులతో ఒకప్పుడు అట్టుడికింది. దీనికితోడు రీ ఆర్గనైజింగ్ కమిటీ (ఆర్‌ఓసీ) పేరుతో కేవలం ఓ వర్గం వారినే లక్ష్యంగా చేసుకుని నరమేధం సాగించారు. ఈ ఆర్‌ఓసీ మాజీ మంత్రి పరిటాల రవీంద్ర కనుసన్నల్లో పని చేసిందనేది జగమెరిగిన సత్యం. ఆర్‌ఓసీ చేతుల్లో వందలాదిమంది ప్రాణాలు వదిలారు. కొంతమంది శవాలు కూడా కనిపించలేదు. చనిపోయిన వారికి గుర్తుగా సమాధులు నిర్మించుకునే అవకాశమూ ఇవ్వలేదు. చాలా కేసుల్లో బాధిత కుటుంబాలు సాక్ష్యం చెప్పలేక కనీసం విచారణకు కూడా రాలేదంటే వారిని ఏ స్థాయిలో బెదిరించారో అర్థం చేసుకోవచ్చు. అనంతపురం రూరల్ మండలం కందుకూరుకు చెందిన సౌమ్యుడు, వివాదరహితుడు అయిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శివారెడ్డిని ఆధిపత్యం కోసం పొట్టన పెట్టుకున్నారు. నిందితులకు పరిటాల కుటుంబం పూర్తి సహాయ సహకారాలు అందించిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో నేరం రుజువైన తర్వాత ముద్దాయిలకు 'రెండు జీవిత కాలాల' శిక్ష పడడంతో రాప్తాడు రక్తచరిత్ర రాష్ట్రంలో మరోమారు చర్చకు వచ్చింది. అలాగే తగరకుంట కొండారెడ్డి హత్య కేసు విచారణ పూర్తయిన తర్వాత కూడా సాక్షులను బెదిరింపులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులోని నిందితులకూ పరిటాల కుటుంబం వెన్నుదన్నుగా నిలిచినట్లు విమర్శలున్నాయి.

టీడీపీ హయాంలో నరమేధం

రాప్తాడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ హయామంతా పరిటాల కుటుంబం హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తూ వచ్చింది. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత పరిటాల సునీత మంత్రి అయ్యారు. గ్రామాల్లో తమకు ఎదురు తిరిగిన వారిని టీడీపీ శ్రేణులు మట్టుబెట్టాయి. ఈ క్రమంలోనే 2015 ఏప్రిల్ 29న పట్టపగలే రాప్తాడులో పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో మాజీ ఎంపీపీ భూమిరెడ్డి ప్రసాద్‌రెడ్డిని టీడీపీ నేతలు హత్య చేశారు. 2018 మార్చి 30న అనంతపురం రూరల్ మండలం కందుకూరులో శివారెడ్డిని అతి దారుణంగా హత్య చేశారు. అదే ఏడాది అక్టోబరు 10న ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీ నేత గూలి కేశవరెడ్డిని హత్య చేశారు. ఈ ఘటనలతో నియోజకవర్గమంతా ఉలిక్కిపడింది. చాలా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లు రాప్తాడు నియోజకవర్గం ప్రశాంతంగా ఉంది. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత ఫ్యాక్షన్‌పై ఉక్కుపాదం మోపారు.

మళ్లీ పురుడు పోసుకుంటున్న ఫ్యాక్షన్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాప్తాడు నియోజకవర్గంలో ఫ్యాక్షన్ మళ్లీ పురుడు పోసుకుంటోందనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇటీవల జరిగిన ఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఎమ్మెల్యే పరిటాల సునీత సొంత మండలం రామగిరి పరిధిలోని కుంటిమద్దిలో టీడీపీ కార్యకర్త నాటు తుపాకీతో వైఎస్సార్‌సీపీ నాయకుడు కేశవ్‌పై దాడి చేయబోయాడు. అప్రమత్తమైన బాధిత కుటుంబ సభ్యులు తిరగబడడంతో పెను ప్రమాదం తప్పింది. అదే మండలంలో వైఎస్సార్‌సీపీ నేత ముత్యాలు ఇంటిపై రాళ్లతో దాడులు చేశారు. వెలుగులోకి రాని ఇలాంటి ఘటనలు చాలానే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజకవర్గ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

హంతకులకు పరిటాల కుటుంబం అండ



గ్రామాల్లో హత్యా రాజకీయాలను ప్రోత్సహించి పబ్బం గడుపుకోవడం పరిటాల కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య. చాలా హత్య కేసుల్లో నిందితులకు పరిటాల కుటుంబం దన్నుగా నిలిచింది. ఆ ధైర్యంతోనే నిందితులు బాధిత కుటుంబ సభ్యులను సాక్ష్యాలు చెప్పకుండా బెదిరింపులకు గురి చేశారు. ఈకారణంగా చాలా కేసులు వీగిపోయాయి. కందుకూరు శివారెడ్డి కేసులో బాధిత కుటుంబ సభ్యులు ఎన్ని బెదిరింపులు వచ్చినా ధైర్యంగా నిలబడ్డారు. ఈ కేసులో నిందితులకు పరిటాల సునీత సొంతూరులో ఆశ్రయం కల్పించారు. అప్పట్లో బాధితుల పక్షాన నిలిచిన నాపై కూడా కేసులు బనాయించారు. తమకు జరిగిన అన్యాయంపై బాధిత కుటుంబాలు ధైర్యంగా నిలబడితే శివారెడ్డి కేసులాగానే కచ్చితంగా న్యాయం జరుగుతుంది. బాధిత కుటుంబాలకు మేము అండగా ఉంటాం.

–తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే

ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఎంపిక షెడ్యూల్ ఖరారు

అనంతపురం: ఎస్‌జీఎఫ్ అండర్-19 ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయి ఎంపిక ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్ ఖరారు అయ్యింది. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ జి.లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు. 2006 జనవరి 1 తరువాత జన్మించిన వారై ఉండాలి. పుట్టిన సంవత్సరం నిర్ధారణకు పాఠశాలలో హెడ్మాస్టర్ సంతకం చేసిన స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ జతపరచాల్సి ఉంటుంది. జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులైతే పదో తరగతి మార్క్సుకార్డు జిరాక్స్ మీద ప్రిన్సిపాల్ సంతకం తప్పనిసరిగా చేయించాలి. క్రీడాకారులు తమ వెంట క్రీడా సామగ్రి తీసుకురావాల్సి ఉంటుంది.

ఈ నెల 27న వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, రగ్బీ, రోప్ స్కిప్పింగ్, 28న బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్, చెస్, నెట్‌బాల్‌కు సంబంధించి అనంతపురం న్యూటౌన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. 30వ తేదీ బాస్కెట్‌బాల్, కబడ్డీ, షటిల్, బ్యాడ్మింటన్, యోగాకు సంబంధించి అనంతపురం అశోక్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అక్టోబర్ ఒకటో తేదీన అథ్లెటిక్స్, హాకీ, ఖోఖో ఎంపిక ప్రక్రియ అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో ఉంటుంది.

ఆస్పత్రులు, ల్యాబ్‌లు రెన్యూవల్ చేయించుకోవాలి



ప్రైవేట్ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

తాడిపత్రిటౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) భ్రమరాంబదేవి మంగళవారం తాడిపత్రిలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లను తనిఖీ చేశారు. ఆస్పత్రులు, ల్యాబ్‌లు నిర్ణీత సమయానికి రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. కొత్త ఆస్పత్రులు, ల్యాబ్‌లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. లేనిపక్షంలో సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆర్‌ఎంపీలు పరిధి దాటి చికిత్స చేయరాదని స్పష్టం చేశారు. డీఎంహెచ్‌ఓ వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు త్యాగరాజు, గంగాధర్ ఉన్నారు.

రైతు ఉసురు తీశారు!

- కలెక్టరేట్లో ఆత్మహత్యకు యత్నించిన రైతు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- రెవెన్యూ అధికారుల అలసత్వం, వైద్యుల నిర్లక్ష్యం వల్లే ప్రాణం పోయిందంటున్న కుటుంబ సభ్యులు



మృతిచెందిన రైతు సూర్యనారాయణ



విలపిస్తున్న సూర్యనారాయణ భార్య ఈశ్వరమ్మ

అనంతపురం/మెడికల్/అర్బన్/గార్లదిన్నె/పామిడి: ఇటు రెవెన్యూ అధికారులు, అటు వైద్యులు కలసి ఓ రైతు ఉసురు తీశారు. సమస్యను పరిష్కరించకుండా నాన్చుతూ వచ్చిన రెవెన్యూ అధికారుల తీరుతో మనస్తాపానికి గురై రైతు పురుగు మందు సేవించగా..సకాలంలో సరైన చికిత్స చేయకుండా నిర్లక్ష్యం వహించి అతను ప్రాణాలు కోల్పోవడానికి వైద్యులు కారణమయ్యారు. అంతిమంగా ఆ రైతు కుటుంబానికి తీరని వేదన మిగిల్చారు. పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ పామిడి మండల కేంద్రంలోని బొడ్రాయి మెయిన్ బజార్‌కు చెందిన కుమ్మర సూర్యనారాయణ (50) అనే రైతు సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన విషయం విదితమే. ఇతను అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. కుమ్మర సూర్యనారాయణ గార్లదిన్నె మండలం బూదేడు గ్రామ సర్వే నంబరు 135-1లో 1.54 ఎకరాల భూమిని తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్నాడు. ఈ భూమికి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్నాడు. నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి పురుగు మందు తాగాడు. పోలీసులు గమనించి స్థానిక సర్వజనాస్పత్రిలో చేర్పించారు. వైద్యులు సకాలంలో సరైన చికిత్స అందించలేదు. అక్యూట్ మెడికల్ కేర్ (ఏఎంసీ) యూనిట్‌లో ఉంచి అత్యవసర వైద్యం అందించాల్సి ఉండగా... సాధారణ పాయిజన్ కేసుగానే పరిగణించి, ఏఎంసీలో పడకలు ఖాళీ లేవన్న సాకుతో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగంలోనే చికిత్స చేశారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటలకు ఏఎంసీ విభాగానికి మార్చారు. ఉదయం 8.30 గంటలకు అతను మృతి చెందాడు. మరోవైపు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మాత్రం రైతు సూర్యనారాయణకు మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకున్నట్లు చెబుతున్నారు. రైతు సూర్యనారాయణకు భార్య ఈశ్వరమ్మతో పాటు కుమారులు హేమంత్, నరేంద్ర ఉన్నారు. హేమంత్ చెన్నైలో క్యాటరింగ్ చేస్తూ జీవనం సాగిస్తుండగా.. బీటెక్ పూర్తిచేసిన నరేంద్ర అదే నగరంలో ప్రైవేట్ జాబ్ చేస్తున్నారు.

కుటుంబ సభ్యుల ఆందోళన

సూర్యనారాయణ మృతికి రెవెన్యూ అధికారులే కారణమంటూ కుటుంబ సభ్యులు సర్వజనాస్పత్రిలో ఆందోళన చేశారు. పట్టాదారు పాసు పుస్తకం సమస్యను పరిష్కరించాలని ఎన్నిమార్లు అధికారులను మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. అందువల్లే ఆత్మహత్య చేసుకున్నాడని కన్నీటి పర్యంతమయ్యారు. సోమవారం ఉదయమే కలెక్టరేట్‌లో పురుగు మందు తాగినా సాయంత్రం వరకు తమకు సమాచారం ఇవ్వలేదన్నారు. అలాగే సర్వజనాస్పత్రిలో సరైన చికిత్స అందించలేదని వాపోయారు.

బూదేడు వీఆర్వోపై ఫిర్యాదు

బూదేడు వీఆర్వో మధుబాబు నిర్లక్ష్యం వల్ల తన భర్త సూర్యనారాయణ మృతి చెందాడని ఈశ్వరమ్మ అనంతపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాసుపుస్తకం ఇవ్వడానికి రూ.13 వేలు లంచం వీఆర్వో అడిగారని, ఆ మొత్తం ఇవ్వడానికి నిరాకరించడంతోనే భూమి వివరాలు ఎక్కించకుండా జాప్యం చేశారని ఆరోపించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపారు.

కలెక్టర్ విచారణ

రైతు కుమ్మర సూర్యనారాయణ ఆత్మహత్య ఘటనపై కలెక్టర్ వి.వినోద్‌కుమార్ విచారణ చేశారు. సంబంధిత తహసీల్దార్, రెవెన్యూ అధికారులను కలెక్టరేట్‌కు పిలిపించి రైతు సమస్య, ఇచ్చిన ఎండార్స్‌మెంట్ తదితర వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేయాలని జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించామని కలెక్టర్ 'సాక్షి'కి తెలిపారు. జాయింట్ కలెక్టర్ బుధవారం క్షేత్రస్థాయిలో రైతు పొలాన్ని పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతారన్నారు.

ఆక్రమణలకు 'అధికార' అండ

- నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం
- ఆక్రమణలను అడ్డుకోబోయిన టౌన్ ప్లానింగ్ అధికారులకు చుక్కెదురు
- ఎమ్మెల్యే కార్యాలయ ఆదేశాలతో వెనుదిరిగిన అధికారులు



రహమత్‌నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న కమర్షియల్ కాంప్లెక్స్

అనంతపురం కార్పొరేషన్: అనధికార నిర్మాణదారులకు 'అధికార' పార్టీ అండగా నిలుస్తోంది. ఇంకేముంది ఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి పనులు చేపడుతున్నారు. దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఎమ్మెల్యే అయిన వెంటనే నగరంలో అతిక్రమణలు, అక్రమ నిర్మాణాలకు ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనధికార నిర్మాణాలకు అవకాశం ఇవ్వొద్దని.. అలా ఎక్కడైనా ఉంటే చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించిన విషయం విదితమే. అయితే ఆ మాటలపై ఆయన నిలబడలేకపోయారు. ఆక్రమణదారులకు ఎమ్మెల్యే ఆశీస్సులు ఉంటే అధికారులు చర్యలు చేపట్టకుండా తోక ముడుస్తున్నారు. ఆశీస్సులు లేని వారిపై మాత్రం కొరడా ఝుళిపిస్తున్నారు.

తొలగింపునకు బ్రేక్ పడ్డాయిలా...

- రహమత్‌నగర్‌లోని కమర్షియల్ ప్రాంతంలో అనధికారంగా నిర్మాణం జరుగుతోంది. వాస్తవంగా నిర్మాణదారుడు జీ ప్లస్ 1 భవనానికి అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నా..అధికారులు షార్ట్‌ఫాల్‌లో (అనుమతి ఇవ్వకుండా) ఉంచారు. కానీ నిర్మాణదారుడు ఎమ్మెల్యే దగ్గుపాటి అండ చూసుకుని అదనంగా మరో ఫ్లోర్ నిర్మించడంతో పాటు సన్‌షేడ్ అతిక్రమించాడు. కాలువలపై నిర్మాణం చేపట్టాడు.
- ఈ నెల 23న అనుమతి లేకుండా నిర్మిస్తున్న అదనపు ఫ్లోర్‌ను కూల్చడానికి టౌన్ ప్లానింగ్ అధికారులు, పట్టణ ప్రణాళిక కార్యదర్శి తదితరులు వెళ్లారు. వెంటనే నిర్మాణదారుడు ఎమ్మెల్యే కార్యాలయానికి ఫోన్ చేయడం.. అక్కడి నుంచి ఆగమేఘాలపై కమిషనర్ నాగరాజుకు ఫోన్ రావడంతో.. ఆయన అక్కడి నుంచి వచ్చేయాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. దీంతో వారు అక్కడి నుంచి వెనుదిరిగారు.

భారీ ముడుపులు!

రహమత్‌నగర్‌లో టీడీపీ అండ చూసుకుని అనధికార నిర్మాణం చేపట్టాడు. వాస్తవంగా ఈ నిర్మాణం ఏర్పాటుకు భారీ ముడుపులందిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయమై కమిషనర్ నాగరాజును వివరణ కోరగా తనదృష్టికి రాలేదని చెప్పారు.

ఏదీ మహిళా శిశు సంక్షేమం?

- బాల్యవివాహాల్లో రాష్ట్రంలోనే జిల్లాకు మొదటి స్థానం
- బరువు లేని చిన్నారులు భారీగానే..
- స్పెషల్ న్యూట్రీషన్ సరఫరా 22 శాతమే
- పౌష్టికాహార లోపంతో ఎదుగుదలకు అవరోధం
- బాలింతలు, గర్భిణులకు మందగిస్తున్న టేక్‌హోం రేషన్
- రాష్ట్రంలో మహిళల్లో రక్తహీనత ఎక్కువగా అనంతపురం జిల్లాలోనే

అన్నింటా అనంత'పూర్'

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మహిళా శిశు సంక్షేమ కార్యక్రమాల అమలులో 'అనంత' వెనుకబడింది. బాలింతలు, గర్భిణులు, అంగన్‌వాడీ చిన్నారులకు సంబంధించిన అన్ని పథకాల అమలులోనూ జిల్లా చివరి స్థానంలోకి పడిపోయింది. ఇక్కడ ఏ స్థాయిలో పథకాలు అమలవుతున్నాయో అంచనా వేయొచ్చు. బాల్యవివాహాల నమోదులో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో ఉన్నట్టు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రతి వంద పెళ్లిళ్లలో 37.3 శాతం మంది అమ్మాయిలు 18 ఏళ్ల లోపు వయసు వారే ఉంటున్నారు. దీనివల్ల టీనేజీ ప్రెగ్నెన్సీలు పెరిగి బరువు తక్కువ చిన్నారులు పుట్టడం, బాలింతలు తీవ్ర రక్తహీనతతో మృతిచెందడం వంటివి జరుగుతున్నాయి. స్పెషల్ న్యూట్రీషన్ సరఫరా అనేది 22.98 శాతమే జరుగుతోందంటే పరిస్థితి ఎలా ఉందో అంచనా వేయచ్చు.

చిన్నారుల్లో పౌష్టికాహార లోపం

అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడేళ్లలోపు చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారంపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. బరువు తక్కువ చిన్నారుల సంఖ్య 40.6 శాతం ఉందంటే దీన్నిబట్టి అంచనా వేయొచ్చు. వయసుకు తగ్గ ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు లేని వారి సంఖ్య కూడా గణనీయంగా ఉంది. వీళ్లకు సకాలంలో సరైన పోషకాహారం అందితేనే ఎదుగుదల ఉంటుంది. దీంతోపాటు కిశోర బాలికల్లో (యుక్త వయస్సు బాలికల్లో) 60 శాతం మందికి రక్తహీనత ఉన్నట్టు తేలింది. బాలింతలు, గర్భిణుల్లో 61 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. స్పెషల్ న్యూట్రీషన్ ఆహారం సరఫరా మిగతా జిల్లాలో 50 నుంచి 70 శాతం పైగా ఉంటే అనంతపురం జిల్లాలో 22.98 శాతం మాత్రమే ఉంది.

కోడిగుడ్లలో మాయాజాలం

గత రెండు మాసాలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం కోడిగుడ్లు సరఫరా అవుతున్నాయి. అంతేకాదు శింగనమల నియోజకవర్గంలో అంగన్‌వాడీ కోడిగుడ్లు బయట మార్కెట్‌లో అమ్ముతున్నట్టు తేలింది. అంటే లబ్ధిదారులకు ఇచ్చే కోడిగుడ్లు పక్కదారి పడుతున్నాయి. పసిబిడ్డలకు ఇచ్చే పౌష్టికాహారం కూడా సెంటర్లకు వెళ్లకపోవడంపై సామాన్యుల్లో తీవ్రంగా చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో చిన్నారులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్య విషయాల్లో మిగతా జిల్లాలతో పోలిస్తే అనంతపురం అన్నింటా వెనకబడి ఉంది.

అనంతపురం జిల్లా గణాంకాలు

బరువు తక్కువ చిన్నారులు	40.6 శాతం
వయసుకు తగ్గ ఎత్తు లేనివారు	36 శాతం
ఎత్తుకు తగ్గ బరువు లేనివారు	19.3 శాతం
గర్భిణుల్లో రక్తహీనత	61 శాతం
బాల్యవివాహాలు	37.3 శాతం
స్పెషల్ న్యూట్రీషన్ సప్లై	22.98 శాతం
టేక్‌హోం రేషన్ (ఇంటికే రేషన్)	88.65 శాతం
వెయ్యి మంది అబ్బాయిలకు అమ్మాయిలు	896 మంది



ఓ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారిని బరువు తీస్తున్న దృశ్యం

క్లుప్తంగా

బకాయిలు చెల్లించాలి : ఆపస్


సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఆపస్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాయదుర్గం, గుమ్మఘట్ట, సూరంపల్లి, సీజీ దొడ్డి, 74 ఉడేగోళం పాఠశాలల్లో 'సభ్యత్వ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. తాము ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఈ సందర్భంగా ఆపస్ నాయకుల దృష్టికి ఉపాధ్యాయులు తీసుకొచ్చారు. ఆపస్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజేంద్ర ప్రసాద్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కళ్యాణి, ఎర్రిస్వామి మాట్లాడుతూ... పీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఆర్జిత సెలవులు తదితర బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆపస్ జిల్లా గౌరవాధ్యక్షుడు కారుమంచి, కార్యదర్శి నరసింహమూర్తి పాల్గొన్నారు.

పీసీబీ ఈఈగా వైఎం ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

అనంతపురం టౌన్: కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్‌గా బి.యుగంధర్ ముని ప్రసాద్ (వైఎం ప్రసాద్) మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న పీవీ కిషోర్‌రెడ్డిని కర్నూలు జిల్లాకు, అక్కడి నుంచి వైఎం ప్రసాద్‌ను అనంతపురానికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మంగళవారం బాధ్యతలు స్వీకరించిన వైఎం ప్రసాద్‌కు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రెండిళ్లలో చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

తాడిపత్రి రూరల్: మండలంలోని యుగుడూరులో రెండు ఇళ్లలో దుండగులు చొరబడి విలువైన వస్తువులను అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన సూర్యనారాయణ, నారాయణస్వామి... తమ ఇళ్లకు తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి హైదరాబాద్‌కు వెళ్లారు. విషయాన్ని గుర్తించిన దుండగులు ఇళ్లకు వేసిన తాళాలను సోమవారం రాత్రి బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి నగలు, నగదు అపహరించుకెళ్లారు. మంగళవారం ఉదయం చుట్టుపక్కల వారు గమనించి సమాచారం ఇవ్వడంతో హైదరాబాద్‌లో ఉన్న బాధితులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ లోపు తాడిపత్రి అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాధితులు వచ్చి ఫిర్యాదు చేసిన తర్వాత ఎంత మేర సొత్తు పోయింది తెలుస్తుందని పోలీసులు పేర్కొన్నారు.

స్కిట్ నిలిచేనా?!

- మూతపడే స్థితిలో శ్రీకాళహస్తీశ్వర ఇంజినీరింగ్ కళాశాల
- జేఎన్‌టీయూ (ఏ) పరిధిలోకి తెచ్చేందుకు కసరత్తు
- సాధ్యాసాధ్యాల పరిశీలనకు కమిటీ నియామకం
- గతంలోనూ రెండు దఫాలు కమిటీలు వేసి సిఫారసుల బుట్టదాఖలు
- ఈసారైనా ఆచరణలోకి తెచ్చి కాలేజీని కాపాడాలంటున్న విద్యావేత్తలు



అనంతపురం: వేలాది మందికి ఉజ్వల భవిష్యత్తు ఇచ్చి.. మంచిపేరు ప్రఖ్యాతులు గాంచిన శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్) కాలగర్భంలోకి కలిసి పోకుండా కాపాడాలని విద్యావేత్తలు కోరుతున్నారు. శ్రీ కాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా 1997–98 విద్యా సంవత్సరంలో స్కిట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభించారు. మొదట ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, కంప్యూటర్ సైన్సెస్ కోర్సులకు అనుమతించారు. ఒక్కొక్క కోర్సులో 60 సీట్లు కేటాయించారు. ఆ తర్వాత కొంతకాలానికి సివిల్ ఇంజినీరింగ్ కోర్సుకు కూడా అనుమతి ఇచ్చారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కళాశాల నిర్వహించే విధంగా ప్రభుత్వం నిర్ణయించింది. ఆరంభంలో ఈ కళాశాల శ్రీకాళహస్తి కాసా గార్డెన్స్‌లో నడిపారు. ఆ తరువాత కొంతకాలానికి శ్రీరామ నగర్ కాలనీకి కొద్ది దూరంలో పూతలపట్టు– నాయుడు పేట ప్రధాన రహదారి పక్కనే 55 ఎకరాల విస్తీర్ణంలో సొంత భవనాలు నిర్మించారు.

రూ.750 కోట్ల ఆస్తులు

రాష్ట్రంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఏకైక ఇంజినీరింగ్ కళాశాల కావడం.. బోధన బాగా ఉండటం.. మంచి ఫలితాలు వస్తుండడంతో అనతి కాలంలోనే స్కిట్‌కు మంచి ఖ్యాతి వచ్చింది. ప్రధాన బ్రాంచ్‌ల్లో అదనపు సీట్లు పెంపుదల చేశారు. దీనికి తోడు డిప్లొమో కోర్సులు సైతం నిర్వహించారు. ఆదాయ పెంపుదల ప్రధానం కాకుండా గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక విద్య అందించాలనే ప్రధాన ఆశయంతో ఈ కళాశాల అప్పట్లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కళాశాల ఆస్తుల విలువ రూ.750 కోట్లు ఉంటాయని అంచనా వేశారు. విద్యార్థుల నుంచి వచ్చే ఫీజులతోనే కళాశాల ఉద్యోగులకు జీతాలు ఇచ్చే విధంగా నియమ నిబంధనలు రూపొందించారు. ముక్కంటి ఆలయం వారు తొలి కామన్ డిపాజిట్ కోసం రూ.50 లక్షలు ఇచ్చారు. ఆ తరువాత కళాశాల నుంచి వచ్చే ఆదాయమే జీతాలకు, అభివృద్ధి పనులకు సరిపోయేది. 1997 నుంచి 2013 వరకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా కళాశాల నిర్వహించారు.

2013 నుంచి తగ్గుముఖం

విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోవడం ప్రారంభమైంది. ఆలయ అధికారులు పట్టించుకోకపోవడం, కళాశాలలో వర్గ రాజకీయాలకు తోడు మితిమీరిన రాజకీయ జోక్యం కారణంగా కళాశాల పతన దిశగా పయనించడం ప్రారంభం అయింది. విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. 2016 నవంబర్ నాటికి అక్కడ పనిచేసే ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రతి నెలా రూ.25 లక్షల వంతున ముక్కంటి దేవాలయం వారు చెల్లిస్తున్నారు. కళాశాల ఉద్యోగుల వేతనాలకు ఇప్పటి దాకా దేవాలయం వారు రూ.14 కోట్లు చెల్లించారు. ఈ భారం అధికం కావడంతో రాష్ట్ర దేవదాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్థితిగతులను అధ్యయనం చేశారు. 2019–20 సంవత్సరంలో పూర్తిగా అడ్మిషన్లు లేవు. అంతకు ముందు సంవత్సరాల్లో చేరిన విద్యార్థులు బీటెక్‌లో 15 మంది, డిప్లొమోలో 12 మంది ఉన్నారు. చివరి సంవత్సరం విద్యార్థులు కోర్సులు ముగిసి బయటకు వెళ్లిపోతారని, కళాశాలను మూసివేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఈ కళాశాలలో 29 మంది బోధన, 36 మంది బోధనేతర ఉద్యోగులు ఉన్నారు.

ఇప్పటికే రెండు దఫాలు కమిటీ ఏర్పాటు

స్కిట్‌ను జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే రెండు దఫాలు కమిటీలను నియామకం చేసి, సిఫారసులను బుట్టదాఖలు చేశారు. మరో దఫా కమిటీని నియమించారు. ఈసారైనా ఆచరణ సాధ్యమయ్యేనా? లేక మొక్కుబడిగా కమిటీ వేసి కాలయాపన చేస్తారా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. పూర్తిగా జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోకి తెచ్చి.. గతంలో మాదిరి విద్యార్థుల ఫీజులతోనే కళాశాలను నిర్వహించాలని, స్కిట్‌లో పనిచేసే ఫ్యాకల్టీని అక్కడికే పరిమితం చేసి జీతాలు చెల్లించాలని, ఉద్యోగులను వర్సిటీ పరిధిలోకి తెస్తే సాంకేతిక, న్యాయపరమైన చిక్కులు వస్తాయని నిపుణులు అంటున్నారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు


నిప్పు పెట్టి పారిపోతున్న నరేష్

గుత్తి: స్థానిక కోట వీధిలో నివాసముంటున్న బేల్దారి శంకర్‌కు చెందిన ద్విచక్ర వాహనానికి అదే ప్రాంతానికి చెందిన నరేష్ నిప్పు పెట్టాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమయ్యాయి. పాత కక్షల నేపథ్యంలో సోమవారం రాత్రి ఈ దుశ్చర్యకు నరేష్ పాల్పడినట్లు నిర్ధారణ అయింది. ఘటనపై కేసు నమోదు చేసిన సీఐ వెంకటేశ్వర్లు... సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా నరేష్‌ను గుర్తించి మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

9వ తరగతి విద్యార్థి అదృశ్యం


గోవర్ధనరెడ్డి

గుత్తి: స్థానిక నంబర్–1 ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ ఎంఎస్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వి.గోవర్ధనరెడ్డి కనిపించకుండా పోయాడు. ఐదురోజుల క్రితం పాఠశాలకు వెళ్లిన గోవర్ధనరెడ్డి తిరిగి హాస్టల్‌కు చేరుకోలేదు. చీకటి పడుతున్నా విద్యార్థి హాస్టల్‌కు రాకపోవడంతో వార్డెన్ బాషా విషయాన్ని వెంటనే బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లిలో నివాసముంటున్న గోవర్ధనరెడ్డి తల్లి స్వప్నకు ఫోన్ చేసి తెలిపాడు. అయితే బాలుడు ఇంటికి కూడా చేరుకోలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ బాలుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంగళవారం ఉదయం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ ఇతరులతో కలసి హాస్టల్ వద్దకు తల్లి స్వప్న చేరుకుని ఆరా తీశారు. అయితే గోవర్ధనరెడ్డి కనిపించడం లేదని ఐదు రోజుల క్రితమే తాను సమాచారం ఇచ్చానని వార్డెన్ తెలపడంతో వాగ్వాదం జరిగింది. అనంతరం గోవర్ధనరెడ్డి కనిపించడం లేదంటూ తల్లితో పాటు వార్డెన్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కసాపురం దేవస్థానం ఈఓగా వాణి



గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఈఓగా కె.వాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న భద్రాజీని అరసవెల్లి సూర్యనారాయణస్వామి ఆలయ ఈఓగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో కాణిపాకం ఈఓగా పని చేస్తున్న వాణిని నియమితులు కావడంతో మంగళవారం ఉదయం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ మర్యాదలతో అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి లడ్డూ ప్రసాదం వివాదంపై సుప్రీం విచారణ చేపట్టాలి

- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి
- వంద రోజుల పాలన వైఫల్యాలపై ప్రజలు దృష్టి సారించకుండా చంద్రబాబు కుట్ర
- ప్రజలను పెడదోవ పట్టించేలా డీసీఎం పవన్ దొంగ దీక్షలు


మాట్లాడుతున్న విశ్వ

అనంతపురం కార్పొరేషన్: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణల్లో నిజాలు నిగ్గు తేల్చేందుకు సుప్రీం కోర్టు ఆధ్వర్యంలో విచారణ చేపట్టి ప్రజల అనుమానాలు నివృత్తి చేయాలని ప్రభుత్వాన్ని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న నిరాధార ఆరోపణలను ఖండించారు. ప్రపంచంలోనే తిరుమల తిరుపతి దేవస్థానానికి ఉన్న విశిష్టతను దెబ్బతీసేలే ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీని హిందూ వ్యతిరేక పార్టీగా ముద్ర వేసే కుట్రలో భాగంగానే సీఎం చంద్రబాబు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రాయశ్చితం పేరుతో దొంగ దీక్షలకు శ్రీకారం చుట్టి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఎత్తుగడ వేశారన్నారు. సీఎం చంద్రబాబు మాటలను ప్రజలు ఎంత మాత్రమూ విశ్వసించడం లేదన్నారు. మొత్తం ఈ వివాదంపై ప్రధాని మోదీకి వైఎస్ జగన్ లేఖ రాయడంతో పాటు సుప్రీం కోర్టులో పిల్ దాఖలు చేశారని గుర్తు చేశారు. వంద రోజుల పాలనా వైఫల్యాలపై ప్రజలు దృష్టి సారించకుండా ఉండేందుకు దేవుడి ప్రసాదంపై సీఎం చంద్రబాబు దుష్ప్రచారం సాగిస్తున్నారన్నారు. టీడీపీ సాగిస్తున్న నీచ రాజకీయాలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

అన్నదాత కష్టం పట్టని బాబు

- జిల్లా రైతు సంఘం నాయకులు
- డిమాండ్ల సాధనకు నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

అనంతపురం అర్బన్: రైతుల కష్టాలు సీఎం చంద్రబాబు గుర్తించడం లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు పెట్టుబడి సాయాన్ని తక్షణమే మంజూరు చేయాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. డిమాండ్ సాధనలో భాగంగా బుధవారం కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఏపీ రైతు సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం చంద్రబాబు విస్మరించారని మండిపడ్డారు. 2023 ఖరీఫ్, రబీలో తీవ్ర అనావృష్టి కారణంగా పంట నష్టపోయిన రైతులకు బీమా ప్రకటించి ఆదుకోవాలన్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా మీటర్ల ఏర్పాటు విషయంలో రైతులకు మద్ధతుగా నిలిచిందన్నారు. అధికారంలోకి వచ్చాక కేంద్రం సూచనతో వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు ఏర్పాటుకు సిద్ధపడి రైతులను దగా చేస్తోందని మండిపడ్డారు. తక్షణమే ఈ ప్రక్రియను విరమించుకోవాలని, లేకపోతే మరో విద్యుత్ పోరాటానికి నాంది పలుకుతామని హెచ్చరించారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర


చలో కలెక్టరేట్ కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం అర్బన్: ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కూటమి ప్రభుత్వాన్ని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా ఈ నెల 30 తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఛలో కలెక్టరేట్ కరప్రతాలను ఆయన విడుదల చేసి, మాట్లాడారు. టైంస్కేల్, కంటింజెంట్, పార్ట్‌టైమ్, గెస్ట్, పీస్‌రేట్, గౌరవ వేతనం తదితర నాన్ రెగ్యులర్ ఉద్యోగులకు శాశ్వత ఉద్యోగులతో సమానంగా వేతనాలు అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీలు, యూనివర్సిటీలు, స్థానిక సంస్థలు, ధార్మిక సంస్థల్లో పనిచేస్తున్న నాన్ పర్మనెంట్ కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో పాటు సమానా పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. 2014 జూన్‌కు ముందు నుంచి నేషనల్ హెల్త్ మిషన్, ఇతర వైద్యారోగ్య స్కీమ్‌ల్లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, వైద్య కళాశాల సిబ్బంది, వివిధ వైద్య విభాగాల్లో పనిచేస్తున్న వారినీ క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు నాగమణి, రామాంజినేయులు, నాయకులు శ్రీనివాసులు, వెంకటనారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


పోలీసుల అదుపులో ఉన్న ఇసుక ట్రాక్టర్లు

కణేకల్లు: మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామ శివారులోని వేదవతి హగిరి పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు సోమవారం రాత్రి పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం ట్రాక్టర్లను సీజ్ చేసి, యజమానులపై కేసు నమోదు చేశారు.

వేరుశనగలో 'యాజమాన్యం' పాటించండి


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

శింగనమల: వేరుశనగ సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచించారు. నార్పల మండలం నడిమిదొడ్డిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శశికళ మాట్లాడుతూ... వేరుశనగ పంటలో వేరుపురుగు, పొగాకు లద్దె పురుగు, శనగ పచ్చ పురుగు ఉధృతి కనిపిస్తోందన్నారు. పొగాకు, శనగపచ్చ పురుగు నివారణకు ఒక లీటరు నీటికి 1.5 గ్రాముల థయోడికార్బ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకుమచ్చ తెగులు నివారణకు ఒక లీటరు నీటికి కలిపి 2.5 ఎంఎల్ హెక్సాకొనజోల్ పిచికారీ చేయాలన్నారు. మొగ్గ దశలో ఉన్న కంది పంటకు ఒక లీటరు నీటికి 5 ఎంఎల్ వేప నూనె కలిపి పిచికారీ చేయాలని, కంది పూత దశలో ఉంటే ఒక లీటరు నీటికి 2.5 ఎంఎల్ క్లోరోపైరీఫాస్ కలిపి పిచికారీ చేయాలన్నారు. అనంతరం డ్రోన్ ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చెన్న వీరస్వామి, పశువైద్యాధికారి గోవిందరాజులు, ఏపీ ఎంఐపీ శివశంకరరెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆపరేషన్ వికటించిందని బంధువుల ఆందోళన


ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు


అనంతపురం: నగరంలోని రామచంద్రనగర్‌లో ఉన్న లావణ్య ఆస్పత్రి ఎదుట కూడేరు మండలం హంసాయవల్లి గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ నెల 9న గ్రామానికి చెందిన రాధమ్మకు లావణ్య ఆసుపత్రిలో ఓ వైద్యుడు శస్త్ర చికిత్స చేసి గర్భసంచి తొలగించాడు. అనంతరం అదే రోజు రాత్రి డిశ్చార్జ్ చేయడంతో ఆమెను కుటుంబసభ్యులు ఇంటికి పిలుచుకెళ్లారు. మరుసటి రోజు ఉదయం మూత్రం రాక తీవ్ర నొప్పితో బాధపడుతున్న రాధమ్మను అదే రోజు తిరిగి లావణ్య ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకు వచ్చారు. ఆ సమయంలో వైద్యుల సూచన మేరకు సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో తమకు తెలిసిన వారి సాయంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి బాధితురాలిని చేర్చారు. వైద్య పరీక్షల అనంతరం గర్భసంచితో పాటు మూత్రనాళం, మూత్రపిండాలకు సంబంధించిన నాళాలను సైతం కత్తిరించినట్లుగా అక్కడి వైద్యులు నిర్ధారించారు. అంతేకాక శస్త్రచికిత్స చేసిన తర్వాత ఆరు నెలల వరకూ విశ్రాంతి అవసరమన్నారు. ఈ విషయం తెలుసుకున్న హంసాయవల్లి గ్రామస్తులు, బాధితురాలి కుటుంబసభ్యులు మంగళవారం రాత్రి లావణ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మూడో పట్టణ సీఐ శాంతి లాల్ అక్కడకు చేరుకుని భరోసా నివ్వడంతో ఆందోళనను విరమించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్


ట్రాక్టర్లను సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

కంబదూరు: మండలంలో టీడీపీ నేతలు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. వివరాలు... టీడీపీ చెందిన ఇద్దరు నాయకులు మంగళవారం ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా కంబదూరు తరలిస్తుండగా చాకలి రేవు సమీపంలో డిప్యూటీ తహసీల్దార్ నారాయణ స్వామి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం ఒక్కో ట్రాక్టర్ యజమానికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. కాగా, ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న వెంటనే డీటీ నారాయణస్వామికి టీడీపీ నేతల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు వచ్చాయి. అయినా ఆయన వారి బెదిరింపులకు తలొగ్గకుండా ట్రాక్టర్లను సీజ్ చేసి కార్యాలయానికి తరలించారు. విషయం తెలుసుకున్న పలువురు డీటీ నారాయణస్వామిని అభినందించారు.

పీహెచ్‌సీ వైద్యుల ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

అనంతపురం మెడికల్: పీజీ వైద్య విద్యలో ఇన్‌సర్వీస్ కోటాను కుదిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 85కు వ్యతిరేకంగా ఏపీ పీహెచ్‌సీ వైద్యుల జిల్లా సంఘం మంగళవారం అనంతపురంలో ర్యాలీ చేపట్టింది. డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకూ కొనసాగిన ర్యాలీ అనంతరం డీఎంహెచ్ఓ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకూ సమ్మె విరమించేది లేదన్నారు. తమ భవిష్యత్తుపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో డాక్టర్ మహేంద్రనాథ్, డాక్టర్ మనోజ్, డాక్టర్ తేజశ్విని, డాక్టర్ ఉన్నతి, డాక్టర్ కె.అరుణ, డాక్టర్ లావణ్య, డాక్టర్ స్వాతి, డాక్టర్ హిమబిందు, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ అర్షియా, తదితరులు పాల్గొన్నారు.

'రథం ఘటనపై సమగ్ర విచారణ చేయాలి'

అనంతపురం అర్బన్: కణేకల్లు మండలం హనకహాల్ గ్రామ రామాలయం రథాన్ని దగ్ధం చేసిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. షెడ్ తాళాలను సోమవారం అర్ధరాత్రి ధ్వంసం చేసి రథానికి నిప్పు పెట్టినట్లు గ్రామస్తులు తెలిపారన్నారు. దీనికి కారకులను త్వరలో గుర్తించడంతో పాటు దుష్ప్రచారాలు చేసే వ్యక్తుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులను కోరారు.

డీఎస్ఓ డిప్యుటేషన్ రద్దు

అనంతపురం అర్బన్: జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్ఓ) టి.వెంకటేశ్వర్లు డిప్యుటేషన్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. మూడు నెలల క్రితం ఆయనను డీఎస్ఓగా నియమించి, ఆ వెంటనే డిప్యుటేషన్‌పై అల్లూరి జిల్లాకు పంపారు. దీంతో డివిజన్ ఏఎస్ఓ శోభారాణికి డీఎస్ఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. తాజాగా వెంకటేశ్వర్లు డిప్యుటేషన్‌ను రద్దు చేస్తూ అనంతపురం డీఎస్ఓ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

యువకుడి దుర్మరణం

గుమ్మఘట్ట: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన కుంటి పాలప్ప కుమార్తె లక్ష్మికి 16 సంవత్సరాల క్రితం 75 వీరాపురం గ్రామానికి చెందిన రమేష్‌తో వివాహమైంది. మంగళవారం ఆమెను కుక్క కరవడంతో విషయం తెలుసుకున్న తమ్ముడు నాగరాజు (38) ద్విచక్రవాహనంపై బాధితురాలిని ఎక్కించుకుని కళ్యాణదుర్గానికి పిలుచుకెళ్లి చికిత్స చేయించాడు. అనంతరం తిరుగు ప్రయాణమైన వీరు 75 వీరాపురం గ్రామ శివారులోకి చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గం మధ్యలో నాగరాజు మృతి చెందాడు. లక్ష్మిని వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. కాగా, మృతుడికి భార్య లక్ష్మి, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యం


శివకుమార్

అనంతపురం: కలెక్టరేట్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న పడిగేరి శివకుమార్ కనిపించడం లేదు. ఈ మేరకు అనంతపురం రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. ఈ నెల 19న ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి చేరుకోలేదు. దీంతో ఆయన భార్య పి.నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రైతు ఆత్మహత్య

డి.హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలం మడేనహళ్లికి చెందిన రైతు లింగన్న (35) ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయం నష్టాలను ఎదుర్కొన్న ఆయన తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. దీంతో భార్య విడిపోయి కర్ణాటకలోని రాజాపూర్‌లో పుట్టింటికి చేరుకుని వేరు కాపురం పెట్టింది. ముగ్గురు పిల్లల్లో చిన్న కుమార్తె నానమ్మ మారెక్క వద్ద, మిగిలిన ఇద్దరు తల్లి వద్దనే ఉంటున్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న లింగన్న... మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి


మృతుడు మల్లికార్జున

గుత్తి: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... తెలంగాణ లోని యాదాద్రి జిల్లా సైదాపురానికి చెందిన మల్లికార్జున (44) కొంత కాలంగా బెంగుళూరులో స్థిరపడ్డాడు. ఇటీవల సొంతూరుకు వెళ్లిన ఆయన మంగళవారం కుటుంబసభ్యులతో కలసి రైలులో బెంగళూరుకు తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో గుత్తి జీఆర్పీ పరిధిలోని తురకపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై జీఆర్పీ ఎస్ఐ నాగప్ప కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా మండల స్థాయి క్రీడాపోటీలు



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

కనగానపల్లి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఎంఈఓ- 2 శ్రీదేవి పోటీలను ప్రారంభించారు. మండలంలోని 8 ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు 300 మంది దాకా క్రీడాకారులు పాల్గొన్నారు. ఖోఖో అండర్- 14 విభాగంలో కనగానపల్లి జెడ్పీహెచ్ఎస్ బాలురు విన్నర్స్‌గా, మోడల్ స్కూల్ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. అండర్- 17 బాలికల విభాగాల్లో జెడ్పీహెచ్ఎస్ కనగానపల్లి విన్నర్స్‌గా, మోడల్‌స్కూల్, కేజీబీవీ విద్యార్థినులు రన్నర్స్‌గా నిలిచారు. ఇక వాలీబాల్, యోగా పోటీల్లో మద్దెలచెరువు, మామిళ్లపల్లి, తగరకుంట విద్యార్థులు గెలుపొందారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీడీ రమేష్ తెలిపారు. పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, హెచ్ఎం అబ్బాస్, పీఈటీలు శివారెడ్డి, జయసింహ, రమేష్, మాధవరాజులు, గురుప్రియ పాల్గొన్నారు.

వెటర్నరీ ల్యాబ్స్ టెక్నీషియన్స్‌కు శిక్షణ



వ్యాధుల నిర్ధారణపై శిక్షణ ఇస్తున్న ఏడీ రామచంద్ర

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గస్థాయి వెటర్నరీ ల్యాబ్స్‌కు సంబంధించి 14 మంది టెక్నీషియన్లకు పశువ్యాధి, జీవాలకు వచ్చే రోగాలకు సంబంధించి నిర్ధారణ పరీక్షలపై శిక్షణ ఇచ్చారు. స్థానిక పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల (అనిమల్ డిసీసెస్ డయోగ్నస్టిక్ ల్యాబ్- ఏడీడీఎల్)లో ఈనెల 27వ తేదీ వరకూ వివిధ అంశాలపై శిక్షణ ఇస్తామని ఏడీడీఎల్ ఏడీ డాక్టర్ ఎస్.రామచంద్ర, పశువైద్యురాలు డాక్టర్ శృతి తెలిపారు. పశువులు, జీవాలకు వ్యాపించే సీజనల్, అంటువ్యాధులు, ప్రాణాంతక రోగాల లక్షణాలు, వ్యాధి ప్రాథమిక నిర్ధారణ, నివారణ చర్యలు, కాపర్లు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. వివిధ రకాల పరీక్షల గురించి ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న పల్లె వెంకటకృష్ణ కిశోర్

అనంతపురం రూరల్: సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ పల్లె వెంకటకృష్ణకిశోర్ అన్నారు. మంగళవారం పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ గ్రీన్ వైర్‌లెస్ కమ్యూనికేషన్ అండ్ సెన్సార్ టెక్నాలజీ పై 5 రోజుల పాటు విద్యార్థులకు ఫ్యాకల్టీ ప్రోగ్రాం ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పల్లె వెంకటకృష్ణకిశోర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు చేరుకుంటారన్నారు. ప్రస్తుతం సాంకేతిక రంగం దూసుకుపోతుందని, దానికి అనుగుణంగా విద్యార్థులు ఆ రంగం వైపు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్‌బాబు, ప్రొఫెసర్లు ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

రైతుల వద్దకెళ్లి మెలకువలు తెలియజేయండి



ముట్టాల వద్ద పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీత, డీఏఓ ఉమామహేశ్వరమ్మ

ఆత్మకూరు: పంటల సాగుపై వ్యవసాయ అధికారులు పొలాల్లోని రైతులకు దగ్గరకు వెళ్లి మెలకువలు తెలియజేయాలని డీఏఓ ఉమామహేశ్వరమ్మ తెలియజేశారు. మంగళవారం మండలంలోని ముట్టాల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా డీఏఓ ఎమ్మెల్యే సునీతతో కలసి నూతన వ్యవసాయ పద్ధతులు, యంత్ర పరికరాలు, ప్రకృతి వ్యవసాయం, పాడి తదితర అంశాలపై రైతులకు వివరించారు. అనంతరం ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేశారు. ఆత్మకూరు, గొరిదిండ్ల, ముట్టాల గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.

ప్రొటోకాల్‌కు మంగళం!

- దళిత ప్రజాప్రతినిధులపై చిన్నచూపు
- కనీస సమాచారం ఇవ్వని వైనం
- ఎంపీపీ, వైస్ ఎంపీపీలకు వాట్సప్ మెసేజ్‌లతో సరి!
- అధికార పార్టీ నేతల కనుసన్నల్లో పంచాయతీ సెక్రటరీలు

ఆత్మకూరు: పంచాయతీలో జరిగే ప్రధానమంత్రి కార్యక్రమమైనా ఆ సర్పంచ్ అధ్యక్షతన జరగాల్సిందే. ఆయనకున్న ప్రొటోకాల్ అలాంటిది. అయితే మండలంలో మాత్రం అధికారులు అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు నడుచుకుంటూ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. కనీస సమాచారం ఇవ్వకుండానే ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మంగళవారం మండలంలో ఎమ్మెల్యే సునీత ఆత్మకూరు, గొరిదిండ్ల, ముట్టాల, గొరిదిండ్ల తండా గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలను ప్రారంభించారు. ఆ అభివృద్ధి పనులు పంచాయతీకి సంబంధించినవి అయినా ఆయా గ్రామాల్లోని దళితులైన సర్పంచ్‌లను, ఎంపీటీసీలను మాత్రం అధికారులు కనీస సమాచారం ఇవ్వలేదు.

ఇష్టారాజ్యంగా అధికారుల తీరు..

మండలంలో కొంతమంది అధికారుల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆరోపిస్తున్నారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. అంతేకాకుండా వారు నిర్వహించిన కార్యక్రమాలకు మాత్రం బిల్లులు చేయాలంటూ తమ వద్దకు వస్తున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం రాప్తాడు నియోజకవర్గంలో పెత్తందార్ల పాలన జరుగుతోందని దళితులకు కనీస సమాచారం , విలువ ఇవ్వకుండా అధికారులు చేస్తున్నారని మండిపడుతున్నారు. పంచాయితీ కార్యాలయాల్లో తమ గదుల్లోనే ఎలాంటి ప్రజా ప్రతినిధులు కాని అధికార పార్టీ నేతలు వచ్చి పెత్తనం చలాయిస్తుంటే పంచాయతీ సెక్రటరీలు వారికి వత్తాసు పలుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రజలకు సేవకుల్లా పని చెయ్యకుండా ఇలా అధికార పార్టీ నాయకుల మెప్పు పొందేందుకు ఎలా పడితే అలా వ్యవహరిస్తారా అని విమర్శిస్తున్నారు. మంగళవారం జరిగిన ప్రభుత్వ కార్యక్రమాల్లో దళితులైన ఆత్మకూరు సర్పంచ్ ఎగ్గిడి వరలక్ష్మి, గొరిదిండ్ల ఎంపీటీసీ చిట్టెక్క, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్‌నాయక్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఎంపీపీ హేమలతకు కూడా కేవలం వాట్సప్‌లో మెసేజ్ పెట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు.



ఆత్మకూరు పంచాయతీ కార్యాలయం

కనీస సమాచారం ఇవ్వలేదు



ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అధికారులు కేవలం కొంత మందికి మాత్రమే సమాచారం ఇస్తున్నారు. ఎస్టీలన్న భావనతో తమకు ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

– చిట్టెమ్మ, గొరిదిండ్ల ఎంపీటీసీ

దళితులని చులకనగా చూస్తున్నారు



ప్రజలు ఓట్లు వేసి మమ్మల్ని సర్పంచ్ స్థానంలో కూర్చోబెట్టారు. ఎలాంటి ప్రభుత్వ కార్యక్రమం అయినా సర్పంచ్ ప్రథమ పౌరుడిగా ఉంటారు. కాని ఆత్మకూరు మండలంలో మాత్రం అధికారులు దీనికి విరుద్ధంగా ఉన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంభందించి ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. దళితులన్న భావంతోనే మమ్మల్ని అధికారులు చిన్న చూపు చూస్తున్నారు. మండల కేంద్రం అయినా అధికారులు సర్పంచ్ అన్న పదవికి విలువ లేకుండా చేస్తున్నారు.

– వరలక్ష్మి, సర్పంచ్ ఆత్మకూరు

వాట్సప్‌లో మెసేజ్ చేస్తున్నారు



మండలంలో ఏదైనా ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తే అధికారులు గతంలో ఒకటి రెండుసార్లు ఫోన్లు చేసి ఆహ్వానించేవారు. కాని ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలపై వాట్సప్ ద్వారా మెజేస్ పంపి చేతులు దులుపుకుంటున్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు.

– విజయ్‌కుమార్ నాయక్, వైస్ ఎంపీపీ

పార్టీ నేతల్లా అధికారుల తీరు



ప్రజలకు సేవలు అందించాల్సిన అధికారులు ప్రస్తుతం అధికార పార్టీ నాయకుల మెప్పు పొందే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ప్రొటోకాల్ పాటించకుండా తమకు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. కొంతమంది అధికారులు రాజకీయ నాయకుల్లా వ్యవహరించడం విమర్శలకు దారితీస్తోంది.

– హేమలత, ఎంపీపీ

సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కండి

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జేఎన్టీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శారద, వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి పరదేశీనాయుడు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శశాంక్‌మౌళి పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన శారద, పరదేశీనాయుడు, శశాంక్‌మౌళి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక స్పృహ అవసరం అన్నారు. గాంధీ ఆశయ సాధన కోసం ఏర్పడిన ఎన్ఎస్ఎస్ ప్రపంచంలో అత్యధిక వలంటీర్లు కల్గిన సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. అనంతరం ఉత్తమ వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు బాలాజీనాయక్, సుధాకర్, విష్ణుప్రియ, రామకృష్ణ, జయలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఎన్టీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శారద

రైతు ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోండి

అనంతపురం అర్బన్: రైతు కుమ్మర సూర్యనారాయణ ఆత్మహత్యకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డికి మంగళవారం కలెక్టరేట్‌లో జేఏసీ నాయకులు సాకే హరి, ఉమామహేశ్వరి, రామకృష్ణ, నారాయణస్వామి, తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు. రైతు ఆత్మహత్యపై విచారణ చేయించి బాధ్యులపై చట్ట, శాఖపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా రైతు కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

పట్టాదారుపాసు పుస్తకం మంజూరు చేయలేదనే బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు సూర్యనారాయణ కుటుంబాన్ని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు రైతు ఆత్మహత్యపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.



డీఆర్ఓకు వినతిపత్రం అందిస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రాప్తాడురూరల్: ఐసీడీఎస్ అనంతపురం రూరల్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న మినీ అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాని సీడీపీఓ ధనలక్ష్మీ తెలిపారు. ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ప్రాజెక్ట్ పరిధిలోని అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు మండలాల పరిధిలో మొత్తం 10 పోస్టులకు బుధవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

పోస్టు పేరు	మండలం	ఖాళీ ఉన్న ప్రదేశం	కేటగిరి
మినీ కార్యకర్త	అనంతపురం రూరల్	టీవీ టవర్	బీసీ-బీ
సహాయకురాలు	అనంతపురం రూరల్	పీసీ కాలనీ	ఓపెన్
సహాయకురాలు	ఆత్మకూరు	ముట్టాల	ఓపెన్
సహాయకురాలు	ఆత్మకూరు	కుర్లపల్లి	ఎస్సీ
సహాయకురాలు	రాప్తాడు	రాప్తాడు-3	ఓపెన్
సహాయకురాలు	అనంతపురం రూరల్	కందుకూరు-3	బీసీ-ఏ
సహాయకురాలు	రాప్తాడు	బొమ్మేపర్తి	ఓపెన్
సహాయకురాలు	అనంతపురం రూరల్	ఎంజీ పలి	డిసేబుల్డ్
సహాయకురాలు	రాప్తాడు	మరూరు-3	ఓపెన్
సహాయకురాలు	అనంతపురం రూరల్	బిందెలకాలనీ	ఎస్టీ

'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్'కు కృషి



మాట్లాడుతున్న భాస్కర్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉత్తమమైన అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం పొంది రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని రూరల్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.భాస్కర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఏర్పాటు చేసిన 'హెచ్ఐవీ నిర్మూలన' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ప్రతి విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలన్నారు. స్వీయ నియంత్రణ పద్ధతులతో చక్కటి జీవితాన్ని సొంతం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్, హెచ్ఐవీ నివారణ సంస్థ సభ్యులు, ఐటీఐ ప్రిన్సిపల్ రామమూర్తి పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ



సబ్ జైలు ఆవరణలో మొక్కనాటుతున్న డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ శివప్రసాద్‌యాదవ్

గుత్తి: పట్టణంలోని స్పెషల్ సబ్ జైలును మంగళవారం డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ శివప్రసాద్‌యాదవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జైలులోని సెల్స్ పరిశీలించారు. ఖైదీల సదుపాయల ఆరా తీశారు. అనంతరం అమ్మకు వందనం కింద స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించి జైలు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ చారి, జైలు అధికారి మహేశ్వరుడు, న్యాయవాదులు గంగాధర్ కుమార్, సూరి తదితరులు పాల్గొన్నారు.

పల్లె వెలుగు బస్సులు ఆపాలి

అనంతపురం రూరల్: ధర్మవరం నుంచి అనంతపురం వెళ్తున్న పల్లె వెలుగు బస్సులు ఆపకుండా వెళుతున్నాయని అన్ని బస్సు స్టాపుల దగ్గర బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని మన్నీల గ్రామానికి చెందిన విద్యార్థులు అనంతపురం ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కోరారు. మంగళవారం డిపో మేనేజర్‌ను కలిస వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తాము బస్సు పాసులు తీసుకున్నామని, అయితే పల్లె వెలుగు బస్సులు ఉదయం పూట మన్నీల గ్రామం దగ్గర ఆపకుండా వెళుతుండటంతో కళాశాల, స్కూళ్లకు వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డిపో వద్దకు వెళ్లి డ్రైవర్లను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా చర్యలు తీసుకొని పల్లె వెలుగు బస్సులు ఆపేలా చూడాలన్నారు.



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థులు

దుస్తులకు నిప్పు

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని సుంకులమ్మపాలెంలోని చర్చి సమీపంలోని ఓ రజకుడికి చెందిన దుస్తులకు సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఇన్‌చార్జి సీఐ శివగంగాధర్‌రెడ్డి వివరాల మేరకు.. ఉతికేందుకు పలు ఇళ్ల నుంచి తీసుకువచ్చిన దుస్తులను శ్రీనివాసులు తన ఇంటి ముందు ఉంచి నిద్రపోయాడు. సోమవారం రాత్రి 11.30కు గుర్తుతెలియని వ్యక్తులు దుస్తులకు నిప్పుపెట్టారు. ఘటనలో దుస్తులన్నీ కాలిపోయాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఇన్‌చార్జి సీఐ తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

శింగనమల/గార్లదిన్నె: నార్పలలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న తనిఖీ చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీ శైలజారాణితో మాట్లాడారు. ఉపాధి ఏపీఓ ఎర్రమ్మ, సిబ్బందితో మండలంలోని కూలీల వివరాలు, పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. పరిపాలన పరమైన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ క్రిష్ణయ్య, ఏఓ ఏమాదేవి, డిప్యూటి తహసీల్దార్ లక్ష్మి నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నె మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం అసిస్టెంట్ కలెక్టర్ తనిఖీ చేశారు.

సొంత హాలు వద్దు..
అద్దె హాలే ముద్దు

- వ్యవసాయశాఖ అధికారుల వింత పోకడ

అనంతపురం అగ్రికల్చర్: సమీక్షలు, సమావేశాల నిర్వహించేందుకు జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలోని మీటింగ్ హాలు బాగుంది. అయినా కూడా ఆ శాఖ అధికారులు ఇటీవల కలెక్టరేట్‌లోనే మీటింగ్‌లు నిర్వహిస్తున్నారు. అక్కడేమి ఉచితంగా నిర్వహించడానికి వీలుండదు. రోజుకు నాలుగైదు వేలు అద్దె కట్టాల్సిందే. గతంలో నెలకు రెండు మూడు సమావేశాలు వ్యవసాయశాఖ కార్యాలయంలోనే నిర్వహించేవారు. చిన్న రిపేరి ఉందంటూ ఏడాది కాలంగా సమావేశ హాలును ఉపయోగించడం లేదు. కలెక్టరేట్‌కు చెల్లించిన అద్దె మొత్తంతో ఈ పాటికే పూర్తిస్థాయిలో హాలు అందుబాటులోకి వచ్చేదని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. వందల సంఖ్యలో కుర్చీలు ఉన్నాయి. పీఓపీ చేయించారు. మైక్ సెట్ ఉంది. లైటింగ్ సిస్టమ్ బాగుంది. ఫ్యాన్లు, కూలర్లు, ఏసీ సదుపాయం ఉంది. భోజనం చేయడానికి పెద్ద హాలు కూడా ఉంది. కానీ ఇక్కడ మాత్రం మీటింగ్‌కు నో అంటున్నారు వ్యవసాయశాఖ అధికారులు. మరి మీటింగ్ హాలులో సమావేశాలు జరగకున్నా... రిపేరీలో ఉన్నట్లు చెబుతున్నా.... ఐఎస్ఓ సర్టిఫికెట్ దక్కించుకోవడం మాత్రం విశేషం.



వ్యవసాయశాఖ జిల్లా కార్యాయలంలో మీటింగ్ హాలు

బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ



వల్లూరు శ్రీనివాసరావు

అనంతపురం: అనంతపురం అర్బన్ డీఎస్పీగా వల్లూరు శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఉన్న డీఎస్పీ టీవీవీ ప్రతాప్ బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో వల్లూరు శ్రీనివాసరావును నియమించారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు పోలీసు సిబ్బంది అభినందనలు తెలిపారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ

అనంతపురం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. మంగళవారం తపోవనం-2 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు సరైన పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. పోషక విలువలు మెండుగా ఉన్న ఆకుకూరలు, పండ్లు, కోడిగుడ్లు తీసుకోవాలన్నారు. చిన్నారుల బరువు పెరుగుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఈశ్వరమ్మ, ఆయా కవిత తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అనంతపురం: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన కొల్లయ్య (24) అనే వ్యక్తి మృతి చెందాడు. చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. కియా పరిశ్రమలో పనిచేస్తున్న కొల్లయ్య ఆత్మహత్యకు సంబంధించిన కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమాజ సేవతో వ్యక్తిత్వ వికాసం



మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్యరావు

అనంతపురం మెడికల్: సమాజసేవతో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవచ్చని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్యరావు పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్, మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ షారోన్ సోనియా, హెచ్ఓడీలు శివశంకర్‌నాయక్, వైద్యనాథ్, వైద్యులు భవాని, శ్రావణి, చైతన్య, శ్రీధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, మెడికోలు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మ కమలాలు



చెన్నేకొత్తపల్లి: చిన్నంపేట గ్రామంలో సోమవారం అర్ధరాత్రి బాలమ్మ ఇంటి పెరట్లోని బ్రహ్మ కమలం మొక్కకు బ్రహ్మకమలాలు విరబూశాయి. ఇవి ఏడాదికి ఒకసారి మాత్రమే వికసిస్తాయని ఆమె తెలిపారు. ఒకే మొక్కకు దాదాపు 30 పుష్పాలు విరబూయడంతో ఆమె మొక్కకు పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల వారు పుష్పాలను ఆసక్తిగా తిలకించారు.